గడువులోగా
ఎల్‌ఆర్‌ఎస్ గగనమే!

- మున్సిపాలిటీలను వేధిస్తున్న సిబ్బంది కొరత
- పరిశీలనకు నోచుకోని లక్షలాది దరఖాస్తులు
- సర్కారు ఒత్తిడిపై ఉద్యోగ సంఘాల ఆగ్రహం
- కసరత్తు లేకుండా గడువు ఏంటని మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రకటించిన లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్-ఎల్ఆర్ఎస్ ఆర్భాటపు ప్రకటన అని, ఆచరణ అసాధ్యమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు ఎలాంటి ముందస్తు కసరత్తు లేకుండా హడావుడిగా ప్రకటన చేశారమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన దరఖాస్తులు, పరిష్కరించేందుకు కావాల్సిన సిబ్బంది మధ్య పొంతన లేకపోవడమే ఇందుకు కారణమని ఉద్యోగ సంఘాల నేతలు చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఎల్ఆర్ఎస్ కోసం 25.60 లక్షల దరఖాస్తులు రాగా వీటిలో ఫీజులు చెల్లించి పరిష్కారానికి నోచుకున్నవి 3 లక్షలకు మించలేదు. ఇంకా 22 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని మార్చి 31 లోగా పరిష్కరించాలని ప్రభుత్వం అధికారులకు గడువు విధించింది. దరఖాస్తుదారులు గడువులోగా పరిష్కరించుకుంటే 25 శాతం రాయితీ కల్పిస్తామని వెల్లడించింది. కానీ మున్సిపాలిటీ అధికారులు, ఉద్యోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నది. లక్షలాది దరఖాస్తులను పరిష్కరించేందుకు ఎంత సమయం పడుతుంది? ఎంత సిబ్బంది అవసరం? అనే విషయాలను పట్టించుకోకుండా ఆగమేఘాలపై ప్రకటన ఎలా చేస్తారని ఉద్యోగ సంఘంలో ఓ కీలక నాయకుడు ప్రశ్నించారు.

దరఖాస్తుల కుప్పలు.. అధికారుల తిప్పలు

రాష్ట్రంలోని ఎల్ఆర్ఎస్ కోసం దాఖలైన దరఖాస్తుల్లో కేవలం 10 శాతం కూడా అధికారులు పరిష్కరించలేదు. కొన్ని మున్సిపాలిటీలలో ఒక్కటంటే ఒక్కటి కూడా పరిష్కారం కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం, పెద్దఅంబర్‌పేట్, తుర్కయాంజల్, బడంగ్‌పేట్‌లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది పరిస్థితి. మరోవైపు రోజూ ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరుగుతున్నదని మున్సిపల్ అధికారులు వాపోతున్నారు. సిబ్బంది లేకుండా తాము మాత్రం ఏం చేయగలమని నిలదీస్తున్నారు. ప్రభుత్వం తమకు ఎన్ని డెడ్‌లైన్లు విధించినా, ప్రజలకు ఎన్ని రాయితీ ఆఫర్లు ప్రకటించినా సిబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించలేమని తేల్చిచెప్తున్నారు.

ఉచిత ఎల్ఆర్ఎస్ ఉత్తముచ్చటేనా!

శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఉచిత ఎల్ఆర్ఎస్ హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు 25 శాతం రాయితీ అంటూ మాట మార్చిందని రాజకీయవర్గాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ హామీని నమ్మి ఓటేసిన ప్రజలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొండి చేయి చూపించిందని పలువురు నేతలు మండిపడుతున్నారు. ఉచిత ఎల్ఆర్ఎస్ హామీ ఉత్తముచ్చటైందని ఎద్దేవా చేస్తున్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేకుండా స్థానిక ఎన్నికల్లో లబ్ధికోసమే హడావుడి చేస్తున్నదని ఆరోపిస్తున్నారు.

పీఎం సెక్రటరీగా శక్తికాంత దాస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు కీలక పదవివరించింది. ప్రధాని నరేంద్ర మోదీ రెండో ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ప్రస్తుతం గుజరాత్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ పీకే మిశ్రా ప్రిన్సిపల్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. తమిళనాడుకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అయిన దాస్ నియామకానికి ప్రధాని అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రధానమంత్రి పదవికాలం ముగిసే వరకు లేదా తదుపరి ఉత్తర్యులు వచ్చేవరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. 42 ఏండ్లుగా సివిల్ సర్వెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన..25వ ఆర్బీఐ గవర్నర్‌గా విధులు నిర్వహించారు కూడా.

జియోటెలీతో థామ్సన్ క్యూలెడ్ టీవీ
ధర రూ.18,999

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ థామ్సన్..దేశీయ మార్కెట్లోకి తొలిసారిగా జియోటెలీ ఆపరేటింగ్ సిస్టమ్‌తో నడిచే 43 అంగుళాల క్యూలెడ్ టీవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.18,999 ప్రారంభ ధరతో ఫ్లిప్‌కార్ట్‌లో ఈ టీవీ లభించనున్నదని పేర్కొంది. జియోటెలీ ఓఎస్ ఆధారిత టీవీలను విడుదల చేయడానికి జియోతో వ్యూవహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ థామ్సన్ క్యూలెడ్ టీవీతోపాటు జియోహాట్‌స్టార్‌ను మూడు నెలలపాటు, జియోసావన్ మూడు నెలలు, జియోగేమ్స్ నెలపాటు ఉచితంగా అందిస్తున్నది. అలాగే రూ.499 విలువైన స్విగ్గీ ఫుడ్ ఆర్డర్‌పై రూ.150 తగ్గింపు కల్పిస్తున్నది.

ఈ మార్కెట్లకు ఏమైంది..

రూ.లక్షల కోట్లలో కరిగిపోతున్న మదుపరుల సంపద

వరుస నష్టాల్లో సూచీలు.. అదానీ, అంబానీలకు భారీ షాక్‌లు

ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.2.5 లక్షల కోట్ల విలువను కోల్పోయిన బడా కార్పొరేట్ సంస్థలు

ముంబై, ఫిబ్రవరి 22: భారతీయ స్టాక్ మార్కెట్లు.. మదుపరులకు షాక్ మార్కెట్లుగా తయారవుతున్నాయి. ప్రధాన సూచీలు వరుస నష్టాల్లో కదలాడుతుండటంతో లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోతున్నది మరి. అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లోని సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లోని నిఫ్టీ.. రెండింట్లోనూ నమోదైన కంపెనీల విలువ గతకొద్ది రోజులుగా దారుణంగా పడిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ఇదీ సంగతి..

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు ముఖ్య కారణాల్లోకి వెళ్తే.. పలు దేశ, విదేశీ పరిణామాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే అంతకంతకూ పడిపోతున్న రూపాయి మారకం విలువ, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతోపాటు ఇజ్రాయెల్-హమాస్ పరస్పర దాడులు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలతో ఏర్పడ్డ వాణిజ్య యుద్ధం భయాలు, నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్, ఆశించిన స్థాయిలో లేని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్ల తగ్గింపులు, పడిపోతున్న భారత జీడీపీ, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం, పడకేసిన పారిశ్రామికోత్పత్తి వంటివి దేశీయ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులను పెద్ద ఎత్తున ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా సెన్సెక్స్ 2,827.95 పాయింట్లు, నిఫ్టీ 848.90 పాయింట్లు కోల్పోయాయి.

అదానీ టాప్ లూజర్

ఈ ఏడాదిలో ఇప్పటిదాకా గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ సంస్థల స్టాక్స్ విలువ భారీగా పడిపోయింది. 11.9 బిలియన్ డాలర్లు (రూ.లక్ష కోట్లపైనే) హరించుకుపోయింది. ఆ తర్వాత ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విలువ 2.94 బిలియన్ డాలర్లు (రూ.25వేల కోట్లపైనే) క్షీణించింది. దిలీప్ సంఘ్వీ, శివ్‌నాడార్, రవీ జైపూరియా వంటి బడా కార్పొరేట్ కంపెనీల విలువ సైతం బాగానే పతనమైంది. అందరిదీ కలిపితే రూ.2.5 లక్షల కోట్లదాకా నష్టం ఉంటున్నది. మరోవైపు ఈ దెబ్బకు బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్‌లో ముకేశ్ అంబానీ స్థానం 17 (87.7 బిలియన్ డాలర్లు)కు, గౌతమ్ అదానీ ర్యాంక్ 23 (66.8 బిలియన్ డాలర్లు)కు దిగజారాయి. అయితే ఇప్పటికీ ఆసియా దేశాల్లోని సంపన్నుల్లో అగ్రస్థానంలో ముకేశ్, ఆ తర్వాత అదానీయే ఉన్నారు.

ఎఫ్ఐఐలు దూరం

విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వీలైనంత ఎక్కువగా వెనక్కి తీసుకుంటూనే ఉన్నారు. జనవరిలో దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ.78,000 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకోవడం గమనార్హం. ఈ నెల్లోనూ రూ.40,436.17 కోట్లు తరలిపోయాయి. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.1,18,436.17 కోట్లు వెనక్కి పోయినట్టైంది. ఇక దేశీయంగా పెట్టుబడులు పెడుతున్న ఎఫ్ఐఐల్లో సుమారు 35 శాతం అమెరికాకు చెందినవారే. అగ్రరాజ్యాధినేత ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వీరి పెట్టుబడుల ఉపసంహరణలు ఇటీవలికాలంలో పెరిగాయని చెప్పవచ్చు. నిజానికి గడిచిన పదేండ్లలో భారతీయ స్టాక్ మార్కెట్లలో ఎఫ్ఐఐ పెట్టుబడుల వాటా 4 శాతానికిపైగా క్షీణించింది. 2015 జనవరిలో 20.2 శాతంగా ఉంటే.. ఈ ఏడాది జనవరిలో 16 శాతంగా ఉన్నది. ఇది 12 ఏండ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గత ఏడాది అక్టోబర్ నుంచి ఎఫ్ఐఐలు తీవ్ర అమ్మకాల ఒత్తిడిలోనే ఉంటున్నారు. అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నారు.

ఇద్దరు ఐపీఎస్‌ల రిలీవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారులను కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. రోడ్ సేఫ్టీ డీజీగా పనిచేస్తున్న అంజనీకుమార్, రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డీజీ అభిలాష బిస్త్‌ను రిలీవ్ చేస్తూ సీఎస్ శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఏపీ ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని వారిని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి రిలీవింగ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. ఈసీ నిర్ణయంపై ఆయన రిలీవింగ్ ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి కేటాయించిన కొందరు అధికారులు క్యాట్ ఉత్తర్వుల మేరకు తెలంగాణాలోనే పనిచేస్తున్నారు.

హైవేల నిర్వహణకు బడ్జెట్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారుల నిర్వహణ కోసం రూ. 23.18 కోట్లు, వరదకు దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్లు, భవనాల మరమ్మతులకు 18.26 కోట్లు విడుదల చేశారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ , ఎన్‌హెచ్ హైదరాబాద్‌కు మూడో త్రైమాసికానికి బడ్జెట్ విడుదల చేస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వు జారీచేశారు.

30 నిమిషాల్లో మొబైల్ డెలివరీ

ఆన్‌లైన్లో బుకింగ్ చేసుకున్నవారికి అందిస్తున్న సంగీత మొబైల్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: మొబైల్, స్మార్ట్‌గాడ్జెట్ ఉత్పత్తుల విక్రయాల్లో అగ్రగామి సంస్థ సంగీత మొబైల్స్ తన పంథాను మార్చుకుంటున్నది. ఈ-కామర్స్ సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి వినూత్న సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మొబైల్‌ను బుకింగ్ చేసుకున్న 30 నిమిషాల్లోనే ఇంటికి డెలివరీ చేసే విధంగా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతానికి ఈ వినూత్న సేవలు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ర్టాల్లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంగీత మొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్ చంద్ర తెలిపారు. ఈ మొబైల్ డెలివరీ సేవలను త్వరలో ముంబై, నోయిడాలో అందిస్తున్నట్లు, తర్వాతి క్రమంలో దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పారు. మెట్రో నగరాలతోపాటు చిన్న స్థాయి పట్టణాల్లో కూడా బుకింగ్ చేసుకున్నవారికి డెలివరి చేయనున్నట్లు తెలిపారు. స్టోర్లలో లభించనున్న అన్ని ఆఫర్లు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి కూడా వర్తించనున్నాయన్నారు. మరోవైపు, బెంగళూరులో ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను సైతం త్వరలో ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ స్టోర్‌లో కృత్రిమ మేధస్సు టెక్నాలజీతో రూపొందించిన అన్ని రకాల ఎలక్ట్రానిక్ పరికరాలు లభించనున్నాయన్నారు.

హైదరాబాద్‌లో ష్నైడర్ మరో ప్లాంట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ఎనర్జీ మేనేజ్‌మెంట్ అండ్ ఆటోమేషన్ దిగ్గజం ష్నైడర్ ఎలక్ట్రిక్..భారత్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించబోతున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలో ప్రారంభమైన ఎలక్రామా 2025 సదస్సులో ష్నైడర్ ఎలక్ట్రిక్ సీఈవో ఒలివర్ బ్లూమ్ మాట్లాడుతూ..భారత్‌లో పెట్టుబడుల పరంపర కొనసాగుతున్నదని, భవిష్యత్తులో మరో మూడు ప్లాంట్లను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం సంస్థకు దేశీయంగా 31 యూనిట్లు ఉండగా, కొత్తగా హైదరాబాద్‌తోపాటు కోల్‌కతా, అహ్మదాబాద్ నగరాలలో కొత్తగా ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. వీటికి ఎంతమేర పెట్టుబడులు పెడుతున్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. ప్రస్తుతం భారత్..డిజిటలైజేషన్, సస్టైనబిలిటీ, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. వచ్చే 25 ఏండ్లలో వాతావరణ కాలుష్యాన్ని 75 శాతం తగ్గించడానికి టెక్నాలజీ పరంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్లు, ముఖ్యంగా డిజిటల్ గ్రిడ్లను ఏర్పాటు చేయడం, ఐవోటీ ఆధారిత విద్యుత్ సరఫరాను చేయడం ద్వారా ఇది సాధ్యమవుతున్నదన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా 12 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి రూ.3,200 కోట్ల మేర పెట్టుబడి పెట్టబోతున్నట్లు గతంలోనే ప్రకటించింది.

గూగుల్ మ్యాప్‌తో.. నల్లమలలో తప్పిపోయిన శివస్వాములు

- ఏపీ పోలీసుల సహకారంతో క్షేమం

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : మొబైల్ ఫోన్‌లో గూగుల్ మ్యాప్‌ను నమ్ముకొని నల్లమలలో శివస్వాములు దారి తప్పిపోయారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన మనోజ్, గురుప్రసాద్, రాజు, గోపాల్‌తోపాటు మరికొందరు స్వాములు మల్లేశ్వరం మీదుగా కాలినడకన శుక్రవారం శ్రీశైలం బయలుదేరారు. సెల్‌ఫోన్‌లోని గూగుల్ మ్యాప్‌లో షార్ట్‌కట్ వెళ్లేందుకు సర్చ్ చేశారు. మ్యాప్‌ను అనుసరిస్తూ అడవిలో ఎనిమిది గంటలు ప్రయాణం చేసి దారితప్పినట్టు గుర్తించి 100 నంబర్‌కు డయల్ చేశారు. ఏపీ పోలీస్, ఫారెస్టు అధికారులు రాత్రి శివ స్వాములను గుర్తించి ఆత్మకూరు నియోజక వర్గం వెంకటాపురంలో వదిలిపెట్టారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 22 : సిద్దిపేట జిల్లా ఖమ్మంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కేసుగాని దేవయ్యపై పోక్సో కేసు నమోదైంది. దేవయ్య ఓ విద్యార్థినిని సైన్స్ ల్యాబ్‌లోకి పిలిచి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. హెచ్‌ఎం, విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ షీ టీమ్‌తో వచ్చి దేవయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

పత్తి కొనుగోళ్లలో భారీగా అక్రమాలు

- టీఆర్ నమోదులో సిబ్బంది చేతివాటం
- రైతుల నుంచి తక్కువకు కొని..ఎక్కువ ధరకు సీసీఐకి విక్రయం
- ప్రాథమిక నివేదికలో విజిలెన్స్ విభాగం వెల్లడి
- ఇప్పటికే ఏడుగురు మార్కెట్ కార్యదర్శుల సస్పెన్షన్
- త్వరలో మరికొందరికి చార్జి మెమోలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వానకాలం సీజన్‌లో జరిగిన పత్తి కొనుగోళ్లలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్టు విజిలెన్స్ విభాగం గుర్తించింది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. దాని ఆధారంగా ఇప్పటికే వరంగల్, జనగామ, ఆదిలాబాద్, చెన్నూర్, భద్రాచలం, చిన్నకోడూరు, పెద్దపల్లి మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేసిన ప్రభుత్వం.. మరి కొందరికి చార్జిమెమోలు జారీచేయనుంది. కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు దళారులతో కుమ్మక్కై తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) సహాయంతో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోళ్లు జరిపి, ఎక్కువ ధరకు సీసీఐకి విక్రయించినట్టు సమాచారం. పత్తి రైతుల పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు వివరాలు వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) వద్ద నమోదై ఉండాలి. అలా నమోదైన రైతులు మాత్రమే ఎకరాకు గరిష్ఠంగా 12 క్వింటాళ్ల వరకు మద్దతు ధర (క్వింటాలుకు రూ.7,521)తో సీసీఐ కేంద్రంలో పత్తిని విక్రయించే అవకాశం ఉంటుంది. కానీ, పలు చోట్ల ఏఈవోలు పత్తి సాగుచేసిన రైతుల వివరాలను నమోదు చేయనట్టు తెలిసింది. అలాంటి రైతులు మార్కెట్లలో టీఆర్‌లు తీసుకొనే వెసులుబాటు ఉన్నప్పటికీ అందుకు అధికారులు సహకరించలేదు. దీంతో ఆయా రైతులు మద్దతు ధరతో సీసీఐకి పత్తి విక్రయించే అవకాశం లేకుండా పోయింది.

వ్యాపారులకు లబ్ధి

దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు రైతుల పేరిట ఏఈవోల నుంచి మాన్యువల్‌గా పంటల సాగు ధ్రువీకరణ పత్రాలను పొందారు. వాటి సాయంతో క్షేత్రస్థాయిలో రైతుల నుంచి క్వింటా రూ.5,500 నుంచి రూ.6 వేలకు కొనుగోలు చేశారని, అనంతరం ఆ సరకును గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తీసుకొచ్చారని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. వ్యాపారులు/దళారులతో కుమ్మక్కయిన కొందరు మార్కెట్ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు వారికి టీఆర్‌లు జారీ చేయడంతోపాటు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వాటి సాయంతో తక్కువ ధరకు కొన్న పత్తిని వ్యాపారులు మద్దతు ధరకు సీసీఐకి విక్రయించారు. టీఆర్‌లు పరిశీలించాల్సిన సీసీఐ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. దీంతో అంతిమంగా రైతులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పలు మార్కెట్లలో తనిఖీలు నిర్వహించారు. రైతుల నుంచి సేకరించిన సరకుకు, సీసీఐ కొనుగోలు చేసిన సరకుకు భారీ వ్యత్యాసం ఉండటంతోపాటు టీఆర్‌లలోనూ భారీగా తేడాలు ఉన్నట్టు ఈ తనిఖీల్లో తేలింది.

14,921 కోట్ల పత్తి కొనుగోళ్లు

గత వానకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 42.23 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. తద్వారా 25.38 లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయడంతో 110 వ్యవసాయ మార్కెట్లు, 76 కాటన్ మార్కెట్లు, 232 పత్తి మిల్లుల ద్వారా కొనుగోళ్లు చేపట్టారు. అలా 8.42 లక్షల మంది రైతుల నుంచి రూ.14,921 కోట్ల విలువైన 20.15 లక్షల బేళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అందులో అధికారికంగా ప్రైవేటు వ్యాపారుల నుంచి 3.18 లక్షల టన్నులు, అనధికారికంగా జనవరి చివరి నాటికి వ్యాపారులు, రైతుల నుంచి దాదాపు 8 లక్షల టన్నుల పంటను కొనుగోలు చేసినట్టు సమాచారం. ఇందులో దాదాపు 5 లక్షల టన్నుల పత్తిని రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, అక్రమ టీఆర్‌లతో సీసీఐకి మద్దతు ధరకు అమ్మినట్టు విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

అందరిపై చర్యలు తీసుకుంటారా?

రాష్ట్రవ్యాప్తంగా 100కుపైగా పత్తి కొనుగోలు కేంద్రాల్లో టీఆర్ అక్రమాలు చోటుచేసుకున్నట్టు అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు 7 మార్కెట్ల కార్యదర్శులను సస్పెండ్ చేసిన ప్రభుత్వం.. మిగిలినవారిపై చర్యలు చేపడుతుందా? లేదా? అనేదానిపై ఆసక్తి నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని పత్తి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు ఎక్కువగా జరిగినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మార్కెటింగ్ శాఖ అధికారులను సంప్రదించగా.. టీఆర్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిగిందని, అందుకు బాధ్యులైన కొందరిని ఇప్పటికే సస్పెండ్ చేశామని చెప్పారు. మిగిలినవారిపై విచారణ కొనసాగుతోందని, అక్రమాలకు పాల్పడినట్టు తేలితే వారికి కూడా త్వరలోనే చార్జిమెమోలు జారీ చేస్తామని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

బ్లడ్ క్యాన్సర్ మరణశిక్ష కాదు

- అందుబాటులో అధునిక చికిత్స
- యశోద హాస్పిటల్స్ ఎండీ జీఎస్ రావు వెల్లడి

మాదాపూర్, ఫిబ్రవరి 22: బ్లడ్ క్యాన్సర్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నదని యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ రావు అన్నారు. బ్లడ్ క్యాన్సర్ చికిత్సకు సంబంధించింది మాత్రమే కాదని, మానసిక బలం, ఆర్థిక మద్దతు, అవగాహన అవసరమని చెప్పారు. మాదాపూర్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం డెక్కన్ హెమటో లింక్ 2025 పేరుతో రెండు రోజుల అంతర్జాతీయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీఎస్ రావు మాట్లాడుతూ..గ్లోబొకాన్ 2020 నివేదిక ప్రకారం.. దేశంలో ఏటా 13 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, వాటిలో బ్లడ్‌క్యాన్సర్ కేసులు గణనీయమైన సంఖ్యలో ఉంటున్నాయని తెలిపారు. లుకేమియా, లింఫోమా, మైలోమా వంటి క్యాన్సర్ కేసులు భారీగా పెరుగుతున్నాయని అన్నారు. క్యాన్సర్ చికిత్సలో ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న చికిత్స విధానాలు రోగులకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని అన్నారు. యశోద హాస్పిటల్స్ సీనియర్ హెమటాలజిస్ట్, డాక్టర్ గణేశ్ జైశేత్వార్ మాట్లాడుతూ.. యశోద హాస్పిటల్స్‌లో 12 సంవత్సరాలుగా 500కు పైగా విజయవంతమైన ఎముక మజ్జ మార్పిడిని, వేలాదిమంది రక్త క్యాన్సర్ రోగులకు చికిత్సను అందించి కొత్త జీవితాన్ని అందించినట్టు తెలిపారు. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన టార్గెటెడ్ థెరపీలు సీఏఆర్- టీసెల్ థెరపీ, జెల్లీ వంటి విధానాలు చికిత్స స్వరూపాన్ని మార్చేశాయని చెప్పారు. బ్లడ్ క్యాన్సర్‌లో అధునాతన ఆశాజనకమైన చికిత్స సీఏఆర్- టీ సెల్ థెరపీ అని, ఇది క్యాన్సర్‌పై దాడి చేయడానికి రోగిలో రోగనిరోధక కణాలను పునరుత్పత్తి చేస్తుంది అని వివరించారు. ప్రసాద హాస్పిటల్, హైటెక్ సిటీలో అవసరమైన ప్రతి బ్లడ్ క్యాన్సర్ రోగికి ప్రపంచస్థాయి చికిత్స అందించడానికి సిద్ధంగా ఉన్నదని తెలిపారు. బ్లడ్ క్యాన్సర్ మరణశిక్ష కాదని, ముందస్తు రోగ నిర్ధారణ అని చెప్పారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణుల బృందం, యువ వైద్యులు పాల్గొన్నారు.



అన్నపూర్ణ కేంద్రాల పునరుద్ధరణకు చర్యలు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి అధికారుల స్పందన

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'అర్ధాకలి అన్నపూర్ణ' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. బల్దియా చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి నేతృత్వంలోని కమిటీలో అడిషనల్ కమిషనర్లు పంకజ, వేణుగోపాల్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. శనివారం కమిటీ సభ్యులు లక్డీకాపూల్, మింట్ కాంపౌండ్ పరిసర ప్రాంతాల్లోని అన్నపూర్ణ కేంద్రాలను సందర్శించారు. వసతులు, భోజన నాణ్యతను పరిశీలించారు. త్వరలోనే మిగతా కేంద్రాలను పరిశీలించి, మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

కదలలేని కాళ్లకు జీవం!

నిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

శస్త్రచికిత్స అనంతరం వైద్యుల బృందం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22: ప్రమాదంలో వెన్నుపూస విరిగి వీల్‌చైర్‌కే పరిమితమైన ఓ వ్యక్తికి హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖాన వైద్యులు కొత్త జీవితాన్ని ఇచ్చారు. నగరానికి చెందిన అంజయ్య (42)కు రెండున్నర సంవత్సరాల క్రితం ఓ ప్రమాదంలో వెన్నుపూస విరిగిపోయింది. కుటుంబసభ్యులు నిమ్స్ దవాఖానకు తరలించగా.. వైద్యులు వెన్నులో రాడ్లు, స్క్రూలను అమర్చారు. కానీ ప్రమాదం జరిగిన నాటి నుంచి ఆయన రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. దీంతో అతడు వీల్ చైర్‌కే పరిమితమయ్యాడు. తీవ్ర నొప్పితో పాటు కదలడానికి కూడా ఇబ్బందిపడుతున్న పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు అతడిని మళ్లీ నిమ్స్ దవాఖానలో చేర్పించారు. వివిధ పరీక్షలు నిర్వహించిన న్యూరోసర్జరీ వైద్యులు స్పైనల్ కార్డ్ స్టిములేటర్ పరికరాన్ని అమర్చాలని నిర్ణయించారు. న్యూరోసర్జన్లు ప్రొఫెసర్ సుచందా భట్టాచార్జీ, డాక్టర్ రామనాథరెడ్డి, డాక్టర్ స్వప్న, డాక్టర్ అవినాశ్‌లీ బృందం శస్త్రచికిత్స నిర్వహించి స్పైనల్ కార్డ్ స్టిములేటర్ పరికరాన్ని విజయవంతంగా అమర్చారు. ఈ చికిత్స ద్వారా చచ్చుబడిన కాళ్లలో చలనం రావడంతోపాటు నొప్పి బాధలు తగ్గుతాయని వైద్యులు తెలిపారు. తమ న్యూరో సర్జరీ విభాగం ఈ తరహా శస్త్రచికిత్సను రాష్ట్రంలోనే తొలిసారి నిర్వహించినట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు.

మూడేండ్లలోనే బీటెక్ పూర్తిచేయొచ్చు!

- 6, 7వ సెమిస్టర్స్‌లోనే పూర్తిచేసే అవకాశం
- ఐదుగురు సభ్యుల నిపుణుల కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : మూడేండ్లల్లోనే బీటెక్ పూర్తి చేయొచ్చు. ఆరో సెమిస్టర్ లేదంటే ఏడో సెమిస్టర్‌లోనే పూర్తిచేసుకోవచ్చు. ఈ సమయానికి 160 క్రెడిట్స్‌ను పొందాల్సి ఉంటుంది. మిగిలిన కాలాన్ని ఇండస్ట్రియల్ ఇంటర్న్‌షిప్/ప్రాజెక్ట్ రూపంలో పూర్తిచేయాలి. ఇలాంటి సంస్కరణలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేసేందుకు, బీటెక్ కోర్సుల సిలబస్‌ను మార్చేందుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఏఐసీటీఈ మాడల్ కరిక్యులాన్ని పరిగణనలోకి తీసుకుని కొత్త కరిక్యులాన్ని రూపొందిస్తున్నది. మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ అధ్యక్షతన ఐదుగురు సభ్యులతో కూడిన నిపుణల కమిటీ శుక్రవారం ప్రతిపాదనలు చేసింది.

కమిటీ సిఫారసులు..

- అన్ని వర్సిటీలు, కాలేజీల్లో కామన్ క్రెడిట్ విధానం. సెమిస్టర్‌కు 20 క్రెడిట్స్ చొప్పున నాలుగేండ్లకు 160 క్రెడిట్స్ . మైనర్, ఆనర్స్ డిగ్రీకి మరో 20 క్రెడిట్స్.
- సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సులను ఏఐ, ఎంఎల్, డాటా సైన్స్, సైబర్ సెక్యూరిటీతో మిళితం.
- అన్ని వర్సిటీలు, కాలేజీల్లో బీటెక్ ఆనర్స్ డిగ్రీతోపాటు, మైనర్ ప్రోగ్రామ్స్.
- రెండు క్రెడిట్లతో కూడిన ఇండస్ట్రియల్ ఇంటర్న్‌షిప్ తప్పనిసరి. సెకండ్, థర్డ్ ఇయర్‌లో ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్‌లు.
- కరిక్యులంతో సంబంధంలేకుండా సంపాదించిన క్రెడిట్స్‌ను బదలాయించుకోవచ్చు. ఉదాహరణకు నాస్కామ్ నిర్వహించే సర్టిఫికెట్ కోర్సుల ద్వారా ఆర్జించిన క్రెడిట్స్‌ను వాడుకోవచ్చు.
- నాలుగేండ్ల కోర్సు కాలంలో నాలుగు ఇండస్ట్రియల్/ఫీల్డ్ విజిట్స్ ద్వారా నైపుణ్యాలను ఆర్జించాలి.